క్లుప్తంగా

ఎంపీ నిరంజన్‌రెడ్డికి సన్మానం



ఎంపీ నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: రాజ్యసభ సభ్యుడు, సుప్రీం కోర్టు న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డిని శనివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ ఘనంగా సన్మానించారు. మద్రిపాలెం వుడాలే అవుట్‌లోని శివశివానీ స్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన నిరంజన్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. ఉన్నత స్థానంలో ఉన్నా స్నేహానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న నిరంజన్ రెడ్డిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు నీరజ్ కుమార్, పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని వినతి



పి.వి.సురేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళిత ఐక్య వేదిక ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధిలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్‌కు పారిశ్రామిక ప్రాంత దళిత ఐక్య వేదిక ప్రతినిధులు శనివారం వినతి పత్రం అందజేశారు. పి.వి.నివాసంలో శనివారం కలిసిన నాయకులు గుల్లలపాలెం,శ్రీహరిపురం,జవహర్‌నగర్ వంటి ముఖ్యమైన కూడళ్లలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కొట్నాన రవి,అనపర్తి సైదా సుదర్శన్, తంతటి సంపత్, గుడాల ఈశ్వరరావు, రావాడ అప్పారావు,యలగాడ రాజు,గుడాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గొందేశివానిపాలెంలో సుమారు రూ.17 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు,సీసీ కాలువ పనులను వార్డు కార్పొరేటర్ లావణ్య శనివారం పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని.. ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.అనంతరం వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, జీవీఎంసీ వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి ఆశ్రయం



వివరాలు సేకరిస్తున్న మమత

విశాఖ విద్య: అనాథ వృద్ధురాలికి బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. కేజీహెచ్ ప్రాంగణంలో నాలుగు రోజులుగా ఉన్నా ఆమెను తీసుకువెళ్లేందుకు ఎవరూ రాలేదు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత శనివారం అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎస్.కోట దగ్గర చందలూరు నుంచి వైద్యం కోసం కేజీహెచ్‌కు వచ్చినట్లు ఆమె తెలిపింది. తనకు ఎవరూ లేరని చెప్పడంతో ఆమెను జీవీఎంసీ షెల్టర్‌కు తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు.

నాడు కళా విహీనం.. నేడు ఆహ్లాదకరం

- వార్డు నంబరు: 60
- రూ.40 లక్షలతో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు
- ఆహ్లాదకరం వాతావరణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నాడు జీవీఎంసీ 60వ వార్డులోని విశాలమైన పార్కు కళావిహీనంగా ఉండేది.పిచ్చి మొక్కలు,రాళ్లు,మట్టి దిబ్బలు, ఇతర వ్యర్థాలతో చాలా అధ్వానంగా దర్శనమిచ్చేది. సాయంత్రమైతే చాలు ఈ పార్కులోకి ఆకతాయిలు చేరి జూదం, మద్యం వంటివి సేవించే వారు. నివాసీయులు పార్కు వైపు చూసేందుకు భయపడే వారు.

నేడు ఆ పరిస్థితి లేదు. పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. పచ్చటి మొక్కల మధ్య చిన్నారుల కోసం వివిధ ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఫలితంగా పార్కు వంక చూడడానికి ఇష్ట పడని వారు నేడు అక్కడ వాతావరణం చూసి ఎంతో ముచ్చట పడుతున్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి



నాడు: కళావిహీనంగా చిల్డ్రన్ పార్కు



నేడు: ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన పార్కు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ ప్రాంతంలో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో చిల్డ్రన్ పార్కు ఉంది.నాడు దీని ఆలనా పాలన చూసే వారు లేకపోవడంతో పార్కు వ్యర్థాలతో నిండి కళావిహీనంగా ఉండేది. ఆకతాయిలకు అడ్డాగా ఉండేది. అలాంటి పార్కు రూపరేఖలు మారిపోయాయి. వినోదానికి కేరాఫ్‌గా మారింది.

ఇదీ పరిస్థితి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్,వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పర్యటించారు. ఆ సమయంలో కాలనీ వాసులు పార్కు అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో ఆనంద్‌కుమార్ జీవీఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం కేవలం ఆర్నెల్ల వ్యవధిలోనే పార్కు రూపరేఖలు మార్చేశారు. రూ. 40 లక్షలతో పార్కును



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు

ఆధునికీకరించడంతో పాటు పచ్చని మొక్కలు నాటారు. చిన్నారులు ఆడుకోవడానికి వీలుగా పరికరాలు ఏర్పాటు చేశారు. వ్యాయామానికి అనువైన ఏర్పాట్లు కూడా చేశారు. చిల్డ్రన్ పార్కుకు నూతన శోభ వచ్చింది. దీంతో స్థానిక వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధే ధ్యేయం



నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నాం. క్షేత్ర పర్యటనల్లో ప్రజలు వివరించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నాం. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి వాటిని పూర్తి చేస్తున్నాం.పశ్చిమ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

–ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త

ఇచ్చిన మాట నెలబెట్టుకున్నాం



దాదాపు రెండు దశాబ్దాలుగా ఇక్కడి పార్కు అధ్వానంగా ఉండేది. దీని అభివృద్ధిని పట్టించుకున్న వారే కరువయ్యారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పార్కు అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చాం. ఆ ప్రకారం పార్కును అభివృద్ధి చేసి చూపించాం.

–పి.వి.సురేష్, వార్డు కార్పొరేటర్

ఆహ్లాదానికి కేరాఫ్



అధ్వానంగా ఉన్న పార్కును అభివృద్ధి చేశారు. పార్కులో ఆహ్లాదకర వాతావరణం ఉంది. మా కాలనీలో ఇంత అందమైన పార్కు తయారు అవుతుందని అనుకోలేదు. నూతన హంగులతో రూపుదిద్దిన పార్కు చిన్నారులకే కాదు పెద్ద వారికి ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది.

– రాజుయాదవ్, గుల్లలపాలెం వుడాకాలనీ

పాలకులకు,అధికారులకు కృతజ్ఞతలు



మా ప్రాంతంలో ఎంతో అందమైన పార్కు నిర్మాణం కావడం సంతోషంగా ఉంది. ఇంత అద్భుతంగా తీర్చిదిద్దుతారని అనుకోలేదు. చక్కటి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన అధికారులకు, పాలకులకు మా ప్రాంత వాసులను తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

–పవన్‌కుమార్, గుల్లలపాలెం వుడాకాలనీ.

వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుల నియామకం



జి. వరం



వెంకునాయుడు



కె. సంతోష్ రాజ్



శరగడం సురేష్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని నాలుగు(మండలాలు) క్లస్టర్లకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. క్లస్టర్–1 అధ్యక్షుడిగా గనతల వరం, క్లస్టర్ –2 అధ్యక్షుడిగా బర్రి వెంకు నాయుడు, క్లస్టర్ –3 అధ్యక్షుడిగా కెమిరెడ్డి సంతోష్ రాజ్, క్లస్టర్– 4 అధ్యక్షుడిగా శరగడం సురేష్ నియమితులయ్యారు.

రసవత్తరంగా క్రికెట్ లీగ్ పోటీలు



క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు



పోటాపోటీగా సాగుతున్న మ్యాచ్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న జగనన్న విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ పోటీలు మూడో రోజు రసవత్తరంగా సాగాయి. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం చంద్రనగర్ గ్రౌండ్‌లో మ్యాచ్‌లను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. తొలి మ్యాచ్ గోపాలపట్నం హైస్కూల్ జట్టుకు రాజారత్న క్రికెట్ జట్టుకు మధ్య జరిగింది. ఇందులో గోపాలపట్నం జట్టు రెండు వికెట్ల నష్టానికి 205 పరుగులు చేయగా, రాజా రత్న జట్టు 12 ఓవర్లలో 91/9 పరుగులు చేసి ఓటమి పాలయింది.

- రెండో మ్యాచ్‌లో ఏబీఎన్ ఎలివెన్ జట్టు 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేయగా కరాసా రాక్ స్టార్ జట్టు 11.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.
- మూడో మ్యాచ్‌లో కరాసా సీనియర్స్, లిమిట్‌లెస్ గ్లాడియర్స్ జట్ల మధ్య పోరు ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన కరాసా సీనియర్స్ 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేశారు. లిమిట్‌లెస్ గ్లాడియేటర్స్ 12 ఓవర్ల లో 7 వికెట్లు కోల్పోయి కేవలం 43 పరుగులు చేశారు. పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల పైడిరాజు, గుణిశెట్టి శ్రీనివాసరావు, జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

రెండో రోజు ఉత్సాహంగా..

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జింక్ మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో పాల్గొని జట్లను పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్,జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పుర్రె సురేష్ యువసేన, హెల్పింగ్ గైస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పి.వి.సురేష్ యువసేన జట్టు విజయం సాధించింది.బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాటింగ్ చేసిన వారికి బహుమతులు అందించారు. ఆదివారం కూడా లీగ్ మ్యాచ్‌లు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

సింధియా: పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. వార్డు పరిధిలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎడ్యుకేషన్ సెక్రటరీ సోయల్ తదితరులు ఎకో వైజాగ్.. స్వచ్ఛ ప్రమాణ్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ అనే ఐదు అంశాలతో కూడిన ప్రతిష్టాత్మకమైన క్యాంపైన్ ప్రారంభించడంసంతోషంగా ఉందన్నారు. ఎకో క్లీన్ అంటే బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే పద్ధతిని నివారించాలని, ఎకో గ్రీన్ అంటే చెట్ల పెంపకం, కమ్యూనిటీ గార్డెన్ వంటి ప్రయత్నాలతో పచ్చటి నగరాన్ని వృద్ధి చేయడం అని వివరించారు. ఎకో బ్లూ అంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, బీచ్ క్లీనింగ్, నీటి సంరక్షణ వంటి చర్యలు చేపట్టడం, ఎకో జీరో ప్లాస్టిక్ అంటే ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించడం, ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేయడం వంటి చర్యలు తీసుకోవడం, జీరో పొల్యూషన్ అంటే నీరు, గాలి, శబ్ద కాలుష్యాన్ని అరికట్టే పద్ధతులను అవలంబించడం ద్వారా విశాఖ నగరాన్ని కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

ఉత్తర ద్వార దర్శనం.. పులకించిన భక్తజనం

విశాఖ విద్య: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం, 52వ వార్డు కరాసలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారంలో స్వామి దర్శనం కోసం భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. కాకాని నగర్‌లోని శ్రీ వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే భక్తుల కోలాహలం కనిపించింది. ఆలయ ప్రధాన అర్చకుడు జాడ రవికుమార్ ఆచార్యుల బృందం తెల్లవారుజామున ధనుర్మాస పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం స్వామిని ఉత్తర ద్వారంలో అదిష్టింపజేశారు. ఏడాదిలో ఒక్క రోజు మాత్రమే స్వామి వారిని ఇలా దర్శించుకునే అవకాశం ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటయ్యనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సేవకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేడుకలో భాగంగా రాత్రి లక్ష తులసీ పూజ నిర్వహించారు.



పిలకవానిపాలెంలో శ్రీరామచంద్రమూర్తి



ఉత్తర ద్వారంలో వేంకటేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు

మల్కాపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని వేంకటేశ్వరస్వామి,సీతా రామ లక్ష్మణ సమేత హనుమాన్ ఆలయాల్లో శనివారం ఉత్తర ద్వారంలో స్వామి దర్శన భాగ్యం కలిగించారు. 60వ వార్డు గుల్లపాలెం వుడాకాలనీలోని హరి హర క్షేత్రంలో కొలువుదీరిన స్వామిని సుగంధ పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేకంగా ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఏడు కొండల చరిత్రను వివరిస్తూ ఇక్కడ ఆలయ నమూనా ఏర్పాటు చేశారు. అలాగే గీతా జయంతి సందర్భంగా భగవద్గీత శ్లోకాలను ఆలపించారు.



ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన వేంకటేశ్వర స్వామి

- పిలకవానిపాలెం,మల్కాపురం, ఐవోసీ వద్ద గల ఆలయాల్లో కొలువు దీరిన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.
- 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకున్నారు.

వైష్ణవాలయాలకు భక్తుల తాకిడి

గోపాలపట్నం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పలు వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వస్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకోవడానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఈ రోజు వేంకటేశ్వరుడిని దర్శించుకుంటే స్వర్గప్రాప్తి కలుగుతుందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్లలో గంటల కొద్ది వేచి ఉండి ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకున్నారు.



ఉత్తర ద్వారంలో స్వామివారి మూర్తులు



ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూ లైన్లలో భక్తులు

వ్యక్తి మృతిపై అనుమానాలు!

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలో శనివారం చనిపోయిన వ్యక్తి మృతిపై అనుమానాస్పద కేసు నమోదైంది. దీనికి సంబంధించి వివరాలు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మహేష్‌యాదవ్ (39) ఆర్‌కేపురంలో ఐదుగురితో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మహేష్‌యాదవ్ హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేపడుతున్న ఓ సబ్ కాంట్రాక్టర్ వద్ద కొంత కాలం నుంచి పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం విధులకు వెళ్లేందుకు గానూ స్నానం చేయడానికి బాత్‌రూమ్‌కి వెళ్లాడు. సమయం గడుస్తున్నా అతడు రాకపోవడంతో అనుమానం వచ్చి బలవంతంగా బాత్ రూమ్ తలుపు తెరిచి చూడగా మహేష్ మృతి చెంది ఉన్నాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. లోబీపీ లేదా గుండెపోటు కారణంగా మృతి చెంది ఉంటాడని పోలీసులు బావించారు. అయితే శుక్రవారం రాత్రి మృతుడి కి కలిసి ఉంటున్న వారితో చిన్నపాటి వాదన జరిగిందని ఈ కారణంగా వారు ఏమైనా చేశారేమో నని స్థానిక వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పోలీసులు మృత దేహాన్ని శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మహే ష్‌యాదవ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు



వివిధ వేషధారణల్లో ప్రతిభ పాఠశాల చిన్నారులు

విశాఖ విద్య: ఎస్‌ఏడీ సెంటర్‌లోని పలు పాఠశాలల్లో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 90వ వార్డు కాకాని నగర్ ఫ్యూచర్ స్టెప్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో క్రిస్మస్ వే డుకలను కోలాహలంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ జగదీశ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శాంతాక్లాజ్, మేరీ మాత వంటి వేషధారణలోని చిన్నారులతో ఉపాధ్యాయులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని ప్రతిభ పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శాంతా క్లాజ్ తదితర వేషధారణల్లో అలరించారు. మల్కాపురం విజ్ఞాన్ టాలెంట్ పాఠశాల, శ్రీహరిపురంలోని లక్కీ అమర్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల కోసం చేపట్టే నియామకాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం కల్పించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద ఆ పార్టీ నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. అయితే జనసేన నేతల దీక్షలను ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం,ఎస్సీ సెల్ మోనటరింగ్ సభ్యులు పూండి మల్లేశ్వరరావు ఖండించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీ కరణ చేస్తుంటే టీడీపీ ,జనసేన ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

26 నుంచి ఏవీఎన్‌లో 'ఆహ్వాన్-2కే23'

డాబాగార్డెన్స్: నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ ఏవీఎన్ కళాశాలలో ఈ నెల 26 నుంచి రెండ్రోజుల పాటు 'ఆహ్వాన్-2కే23'పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలిరోజు కార్యక్రమంలో ప్రముఖ సినీ తార అవికాగోర్, జబర్దస్త్ ఫేం బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్, రెండో రోజు కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ మెజీషియన్ బీఎస్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శనివారం కళాశాల ప్రాంగణంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ప్రముఖులు సందర్శించి విద్యార్థులను అభినందించారు.
కిసాన్ దివస్‌ను పురస్కరించుకుని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు(విద్యార్థులు) రైతులు పడే కష్టాల్ని వివరిస్తూ ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు రైతుల వేషధారణతో కూరగాయలు విక్రయించే స్కిట్ ప్రదర్శించారు. 26 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఫెస్ట్‌కు సంబంధించిన వివరాల్ని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, గాంధీ, అర్చన, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవకుడికి సత్కారం

సింధియా: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 40వ వార్డు సింధియాన్యూకాలనీలోని శివాలయం అర్చకుడు శ్రీను పంతులు ఆధ్వర్యంలో సంఘ సేవకుడు సేనాపతి కన్నంనాయుడు(తాతబాబు) దంపతులను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతబాబు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు.



తాతబాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం